## భక్తజన కొండగట్టు



అంజన్న ఆలయం ఎదుట భక్తులు

మల్యాల, జనవరి 30: కొండగట్టు అంజన్న క్షేత్రం కిక్కిరిసింది. సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. దొంగల మర్రి నుంచి కొండగట్టు ఆలయం దాకా మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం కాగా, స్వామివారి దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. ఆలయ ఈవో టంకశాల వెంకటేశం, పాలక మండలి చైర్మన్ తిరుక్కోవళూర్ మారుతీస్వామీ పరిస్థితిని పర్యవేక్షించారు. స్వామివారిని సుమారు 25 వేల మంది దర్శించుకున్నారని, వివిధ సేవల రూపంలో ఆలయానికి ₹10 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాసశర్మ, ఇన్‌స్పెక్టర్లు సంపత్, బండ లక్ష్మారెడ్డి, లక్ష్మీరాజం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

## కవ్వంపల్లి క్షమాపణలు చెప్పాల్సిందే

- కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదు
- బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్, జనవరి 30 : జడ్పీటీసీ సభ్యుడు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్‌పై దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. పూటకో పార్టీ మార్చే ఆయనకు రాజకీయాలపై అవగాహన లేదని, ఉంటే ప్రజాస్వామ్యాన్ని ఇలా అపహాస్యం చేయడని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. మానకొండూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రొటోకాల్ ప్రకారం ఉండాల్సిన తన సీటు ఏది? అని అడిగిన జడ్పీటీసీపై ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడమే కాకుండా పోలీసులను పురామయించి బలవంతంగా సమావేశ మందిరం నుంచి బయటకు తీసుకువెళ్లాలని ఆదేశించడాన్ని ఖండించారు. ఇలాంటి చరిత్ర గతంలో ఏ ప్రభుత్వానికీ లేదని విమర్శించారు. కేవలం మానకొండూర్ నియోజకవర్గంలో మాత్రమే సర్వసభ్య సమావేశాలకు జడ్పీటీసీలు వేదికపై రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు నియోజకవర్గాల్లోనే ఇలా జరుగుతున్నదా..? అని ప్రశ్నించారు. బీసీ జడ్పీటీసీని అగౌరవపరిచేలా ప్రవర్తించిన కవ్వంపల్లిపై చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పార్టీల ప్రజాప్రతినిధులకు సముచిత గౌరవం ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రాగానే ఇలా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. తీరు మార్చుకోక పోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సిరిసిల్ల జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, మానకొండూర్, శంకరపట్నం, గన్నేరువరం జడ్పీటీసీ సభ్యులు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, రొడ్డ పృథ్వీరాజ్, శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌రెడ్డి, పడాల సతీశ్‌గౌడ్, బోడ రాజశేఖర్, రామగిరి అంజనేయులు, పిండి సందీప్, కొట్టె రఘు పాల్గొన్నారు.

## దశరథ క్షేత్రం.. తీరొక్క సేద్యం



పేడతో తయారుచేస్తున్న సేంద్రియ ఎరువు





గోశాలలో మూగాల ప్రభాకర్



తయారైన ఎరువును పరిశీలిస్తున్న మల్కపేట రైతులు

- తీరొక్క పండ్లు, కూరగాయల తోటలు
- సేంద్రియ ఎరువుల వాడకం
- కోనరావుపేట మండలం ధర్మారంలో వినూత్నంగా పంటల సాగు
- రైతులకు అవగాహన
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఎంప్లాయ్ ప్రభాకర్
- అభినందించిన జిల్లా వ్యవసాయాధికారులు

**వాతావరణ మార్పులతో వ్యవసాయంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రసాయన ఎరువులు, మందులు లేనిదే పంటలు పండించలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవితం అందించాలనే లక్ష్యంతో కోనరావుపేట మండలంలోని ధర్మారంలో సత్యవతి గోశాల నిర్వాహకుడు మూగాల ప్రభాకర్ దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేశాడు. సేంద్రియ ఎరువులు తయారు చేసి వాటితో తీరొక్క పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేస్తున్నాడు. మిగతా రైతులకు తోటల సాగుపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.**



పండ్లు, కూరగాయాల తోటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, ఏవోలు, ఏఈవోలు

కోనరావుపేట, జనవరి 30: హైదరాబాద్‌కు చెందిన మూగాల ప్రభాకర్ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయనకు చిన్నతనం నుంచే వ్యవసాయం అంటే మక్కువ. అదే ఆసక్తితో కోనరావుపేట మండలం ధర్మారంలో 25 ఎకరాల భూమిని కొనుగోలు చేసి, దశరథ వ్యవసాయ క్షేత్రాన్ని (2008లో) ఏర్పాటు చేశాడు. సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలనే ఆశయంతో ముందుకు సాగాడు. హైదరాబాద్‌లోని గోశాల నుంచి పశువుల పేడను తీసుకువచ్చి మామిడితోట సాగు చేయగా, చెట్లు ఎదిగి మంచి కాత రావడంతో పండ్లను హైదరాబాద్‌లోని మార్కెట్‌లో విక్రయించాడు. ఇలా ఆ తోటలో లాభాలు వచ్చినా, నష్టాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా సేంద్రియ ఎరువులతోనే 2018లో అన్ని రకాల పండ్ల తోటలను సాగు చేయాలని సంకల్పించాడు. ఇక అప్పటి నుంచి పండ్ల తోటలు సాగు చేస్తూ సమీప గ్రామాల రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నాడు.

### క్షేత్రం.. తీరొక్క పండ్లకు నిలయం

దశరథ వ్యవసాయ క్షేత్రంలో మామిడి, సీతాఫలం, సపోట, అరటి, టైగర్ జామున్, జామ, అల్లనేరడి, నిమ్మ, నారింజ వంటి పండ్లు, కూరగాయలు సాగు చేస్తున్నాడు. ఈ క్షేత్రంలోనే 30కి పైగా దేశీ ఆవులను సంరక్షిస్తున్నాడు. వాటి పేడతోనే స్వయంగా ఎరువులు, మందులు తయారు చేసి పంటలకు తోటలకు వేయడంతో ఎక్కువ దిగుబడి వస్తున్నది.

### పేడతో చేస్తున్న ఉత్పత్తులివే..

పశువుల ద్వారా క్రిమి మిశ్రమ ఎరువు, ద్రవ జీవామృతం, ద్రవ వృథా డికంపోజర్, అలాగే నిమ్మచెట్టు ద్వారా నీమాస్త్రమ్, వేప చెట్టు గింజలతో వేప గింజల కషాయం, దశపర్ని కషాయం, పంచగవ్య, ఘన జీవామృతం వంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉత్పత్తి చేస్తున్నాడు. దీంతో రైతులకు పెట్టుబడి భారం అధికం కాకుండా తయారీ ఖర్చు మాత్రమే తీసుకుంటూ విక్రయిస్తున్నాడు. తద్వారా పలువురు రైతులు తమ పంటల సాగులో ప్రయోగాత్మకంగా వాడుతున్నారు.కాగా, దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని సమీప గ్రామాల రైతులు, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రభాకర్ తయారు చేసే సేంద్రియ ఎరువులతోపాటు పండ్ల తోట, కూరగాయల సాగు బాగుందని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ప్రశంసించారు.

### భావితరాలకు మంచి భవిష్యత్



భావి తరాలకు మంచి జీవితాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. రైతులు సేంద్రియ ఎరువులు, మందులే వాడి సాగు చేయాలి. రైతుల కోసమే నేను దశరథ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేశా. రైతులు తమకు వీలున్నప్పుడు వస్తే ఎరువులు, మందుల వాడకంపై అవగాహన కల్పిస్తా. భవిష్యత్ తరాల వాళ్లకు భూమాతను రక్షించి ఇవ్వడమే నా బాధ్యత. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

**- మూగాల ప్రభాకర్, దశరథ క్షేత్రం నిర్వాహకుడు**

### సేంద్రియ ఎరువులే వాడాలి



రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులే వాడాలి. తద్వారా పంటకు పెట్టుబడి భారం తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుంది. భవిష్యత్ తరాలకు కూడా భూమిని సంరక్షించడంతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించ గలుగుతాం. రైతులు అధిక మొత్తంలో రసాయనిక ఎరువులు వాడొద్దు. దశరథ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, సేంద్రియ ఎరువుల వాడకం గురించి తెలుసుకోవాలి.

**- వెంకట్రావమ్మ, ఏవో (కోనరావుపేట)**



మాట్లాడుతున్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు

## ఓటమి భయంతోనే 'బండి' విమర్శలు

కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకొచ్చిన ఘనత వినోద్‌కుమార్‌దే
బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 30: పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే బండి సంజయ్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌పై ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని రాజన్న సిరిసిల్ల జడ్పీ ఉపాధ్యక్షుడు సిద్ధం వేణు, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు జక్కుల నాగరాజు మండిపడ్డారు. నగరంలోని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బండి సంజయ్‌కి ఓటమి భయంతో నిద్ర కూడా పట్టడం లేదని, పార్లమెంట్ నియోజకవర్గంలోని గ్రామాల పేర్లు కూడా తెలియని ఏకైక ఎంపీ బండి సంజయ్ అని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు మత రాజకీయాలతో హైదరాబాద్‌కే పరిమితమయ్యారని, ప్రజలు ఛీకొడుతున్నారని మళ్లీ ఇప్పుడు మత రాజకీయాలు మొదలు పెట్టారని విమర్శించారు. వినోద్‌కుమార్ గెలిచినా, ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బండి సంజయ్ తన మాట తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు మధుసూదన్‌రెడ్డి, భూక్యా తిరుపతినాయక్, తిరుపతి, రాజు, సాయికృష్ణ, జశ్వంత్, సత్తినేని శ్రీనివాస్, జీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం

- గోపరపల్లిలో బైక్ అదుపుతప్పి ఇద్దరు స్నేహితుల మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం





దాసరి వంశీకృష్ణరెడ్డి, జీల మహేశ్ (ఫైల్)

ఓదెల, జనవరి 30: అతివేగం ఇద్దరు స్నేహితుల ప్రాణం తీసింది. బైక్ అదుపుతప్పి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఇరుకుటుంబాల్లో తీరని విషాదం మిగిలింది. పొత్కపల్లి ఎస్ఐ శ్రీధర్, స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలం గోపరపల్లి గ్రామానికి చెందిన దాసరి వంశీకృష్ణరెడ్డి(20), కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన జీల మహేశ్(18), సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన పసిడ్ల సంజయ్ (22) ఈ ముగ్గురు స్నేహితులు. సోమవారం రాత్రి సంజయ్ తన బైక్‌పై పెగడపల్లిలోని స్నేహితుడు మహేశ్ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి వీరిద్దరూ కలిసి మరో స్నేహితుడు వంశీకృష్ణరెడ్డి వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత ఈ ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై కొలనూర్ వైపు బయలు దేరారు. బైక్‌పై అతివేగంగా వెళ్తున్న వీరు.. రాత్రి 9.30గంటల ప్రాంతంలో గోపరపల్లి శివారులోని మూలమలుపు వద్ద అదుపుతప్పి పడ్డారు. రోడ్డు పక్కన బండరాయి, చెట్టును బైక్ ఢీ కొనగా, ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యలో వంశీకృష్ణ రెడ్డి మృతిచెందాడు. మహేశ్ కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందుతూ.. మంగళవారం ఉదయం పరిస్థితి విషమించి కన్నుమూశాడు. సంజయ్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ ముగ్గురు కలిసి ఎక్కడికి వెళ్తున్నారు..? ఏం పనిమీద వెళ్తున్నారో వివరాలు తెలియరాలేదు. వంశీకృష్ణరెడ్డి సుల్తానాబాద్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుండగా, మహేశ్ హన్మకొండలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. మహేశ్ తల్లిదండ్రులకు ఒకడే కొడుకు కావడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వంశీకృష్ణరెడ్డి తండ్రి నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంజయ్‌పై అతి వేగం, అజాగ్రత్తగా వాహనం నడిపినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.



జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## భూ కబ్జాదారులపై ఉక్కుపాదం

స్పష్టం చేసిన మంత్రి పొన్నం ✻ అధికారులతో సమీక్షా సమావేశం

రాజన్న సిరిసిల్ల, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : భూకబ్జాలను ఉపేక్షించేది లేదని, ఉక్కుపాదం మోపాలని అధికారులను బీసీ సంక్షేమ, రవాణా శాఖల అధికారి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారినుంచి తిరిగి వెంటనే స్వాధీనం చేసుకోవాలని, వాటిని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలని ఆదేశించారు. తమ స్థలాలను ఎవరైనా ఆక్రమించుకుంటే తగిన ఆధారాలతో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మహాశివరాత్రి వేములవాడ జాతరకు వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గుడి చెరువులో నీటి నిల్వలు సరిపడా ఉండేలా చూడాలని సూచించారు. అగ్రహారంలో గుట్టల్లో ప్రైవేట్, ప్రభుత్వ భూముల హద్దులకు పెన్సింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా హద్దులు లేక గ్రానైట్ తరలి పోతున్నదని, దీంతో ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుందని విప్ ఆది శ్రీనివాస్ తెలుపగా, గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే జరిమానాలు వసూలు చేయాలని, భూముల వివరాలు గూగుల్ మ్యాప్‌లో చేర్చాలని సూచించారు. అలాగే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటూనే నేతన్నకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అందుకు అధికారులు నేతన్నల్లో మనోధైర్యం కల్పించాలని సూచించారు. బతుకమ్మ చీరలు, పాలిస్టర్, కాటన్ వస్త్ర ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. వస్త్ర ఉత్పత్తులకు అవసరమైన యారన్ ప్రభుత్వం సరఫరా చేస్తుందని చెప్పారు. పవర్‌లూంలు లేని కార్మికులకు యూనిట్లు కేటాయిస్తామన్నారు. వచ్చే వేసవిలో జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోర్స్, స్టోరేజ్ సిస్టం, డిస్ట్రిబ్యూషన్ సిస్టంను పున సమీక్షించి సోర్స్‌పాయింట్ నుంచి ఎండింగ్ పాయింట్ వరకు అధికారులు మూడు రోజుల్లో ఎక్సర్‌సైజ్ పూర్తి చేయాలని సూచించారు. చేపపిల్లల విత్తన ఉత్పత్తికి ఎస్సారార్ జలాశయం కేంద్ర బిందువు కావాలని ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లోని వెయ్యి మందికి కేజ్ కల్చర్ ద్వారా ఉపాధి కల్పిస్తామన్నారు. ముంపు గ్రామాల సమస్యలపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పది ఫలితాల్లో జిల్లాను ముందు వరసలో నిలుపాలని సూచించారు. సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

## వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





ఉత్సవాల సందర్భంగా త్యాగరాజచిత్రపటంతో ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, జ్యోతిప్రజ్వలన చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 30: రాజన్న క్షేత్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 'జగదానంద కారక', 'దుడుకుగలనన్నే లుకోరా రామా..', 'సాధించినే', 'కనకనరుచిరా', 'ఎందరో మహానుబావులు'.. పంచరత్న గీతాలు భక్తులను అలరించాయి. మంగళవారం రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై 71వ ఆరాధనోత్సవాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో కృష్ణప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అన్నారు. శ్రీరామభక్తుడిగా అనేక వేల కీర్తనలు రచించినటువంటి త్యాగరాజస్వామివారి ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సంగీత ప్రియులకు ఇది మంచి అవకాశంగా భావిస్తున్నామని, యువ సంగీత, సాహిత్య కళాకారులను ప్రోత్సహించే దిశగా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ముందుగా త్యాగరాజస్వామి వారి చిత్రపటంతో అర్చకులు, వేదపండితుల వేద మంత్రాలమధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం సంస్కృత కళాశాల విద్యార్థులు నగర సంకీర్తన చేశారు. ఉత్సవ ప్రారంభంలో పాలెపు చంద్రశేఖరశర్మ శ్రీ త్యాగరాజస్వామివారి జీవిత విశేషాలు వివరించారు.



➤ హరికథాగానం చేస్తున్న స్వర్ణలత భాగవతారిణి








కల్యాణ్‌నగర్‌లో రోడ్డు పక్కన సత్యాగ్రహ దీక్ష చేపడుతున్న న్యాయవాది, సామాజిక సేవకులు గజ్జెల్లి వెంకటేశ్వర్లు

## గెలిచిన తర్వాత సమస్యలు కనపడవా..?

- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌కు న్యాయవాది ప్రశ్న
- ప్రజా సమస్యలపై ఖనిలో సత్యాగ్రహ దీక్ష

కోల్‌సిటీ, జనవరి 30: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజాపాలన పూర్తిగా గాడి తప్పిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరికి వారే అన్నట్టు తయారైందని గోదావరిఖనికి చెందిన న్యాయవాది గజ్జెల్లి వెంకటేశ్వర్లు వాపోయారు. గోదావరిఖని కల్యాణ్‌నగర్ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సైతం ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పాత్రలో కల్యాణ్‌నగర్, లక్ష్మీనగర్, మేదరిబస్తీ రోడ్లు, డ్రైనేజీలను నిరసిస్తూ ఒకరోజు బంద్‌కు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయనకు ఈ సమస్యలు కనిపించవా..? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే ప్రజా సమస్యలు గుర్తుకు వస్తాయా..? అని విమర్శించారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా రామగుండం నగరంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కల్యాణ్‌నగర్‌లో ప్రధాన రోడ్డు పక్కన ఆయన శాంతియుతంగా సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. పలు సంఘాల బాధ్యులు హాజరై పూలమాల వేసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కార్పొరేషన్‌లోని 50 డివిజన్లలో డ్రైనేజీలు, రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయని, పేరుకే నగరమైనా నరకకూపాన్ని తలపిస్తున్నదని ఆరోపించారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మేయర్ జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాగా, సత్యాగ్రహ దీక్షకు స్థానిక న్యాయవాదులు, ప్రైవేటు వైద్యులు, బుక్‌స్టాల్, ఇతర వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, వాహన చోదకులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా తరలివచ్చారు.


